క్లుప్తంగా

నేడు వెల్లాలలో హుండీ లెక్కింపు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లోని హుండీలను శుక్రవారం లెక్కింపు చేపడుతున్నట్లు ఆలయ ఈఓ బీవీ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు, ఆయా గ్రామ ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

రాజన్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం మధ్యాహ్నం రాచమల్లు వారి రాజన్న భోజనం క్యాంటిన్‌ను పరిశీలించారు. అనంతరం భోజనం చేసేందుకు వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడి భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి మార్గంలో జీవించాలి

రాజుపాళెం : ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో జీవించాలని నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన అబ్దుల్ గఫార్ అన్నారు. మండలంలోని కూలూరు గ్రామంలో గురువారం ప్రపంచ శాంతి కోసం ఆటో యాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడిచి, తోచినంత దానం చేయాలని చెప్పారు.

ముమ్మరంగా ఆలయ నిర్మాణ పనులు

రాజుపాళెం : మండలంలోని కొట్టాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, రామాలయ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయ గాలిగోపురం, ముందువైపు స్లాబ్ పనులు పూర్తయ్యాయి. త్వరితగతిన ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఆలయాలను దాదాపు రూ.70 లక్షలతో నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతల సహకారంతో ఆలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు.

రేపు చలో విజయవాడ

మైదుకూరు : విద్యారంగ సమస్యలపై ఈనెల 30న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు తెలిపారు. గురువారం మైదుకూరులో చలో విజయవాడ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గండి సునీల్ కుమార్, కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. అనంతరం గిరిజన గురుకుల పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 30న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి తెలిపారు. ఈమేరకు గురువారం బీసీ హాస్టల్‌లో పోస్టర్లు విడుదల చేశారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రొద్దుటూరు కల్చరల్ : జీపీఎస్‌కు వ్యతిరేకంగా ఈనెల 30న శనివారం ఉదయం 10 గంటలకు కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీ మేరకు జీపీఎస్‌ను ఉపసంహరించుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నా బలవంతంగా జీపీఎస్‌ను అమలు చేయడం తగదన్నారు. ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మునివర్ధన్ కుమార్, ఈశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

- ఇంటి వద్దే వైద్య పరీక్షలు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి చాంబర్‌లో ఎమ్మెల్యే గురువారం వైద్య సిబ్బందిచే బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం ఈ గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విద్య, వైద్య రంగాలకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలను చేపట్టిన ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 5 కోట్ల జనాభా కలిగిన రాష్ట్రంలో ప్రతి ఇంటికి వెళ్లి బీపీ, షుగర్, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, టీబీతోపాటు పలు పరీక్షలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిల్లో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని, వాటి ద్వారా అనేక రకాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నారన్నారు. నిమిషాల్లోనే ఇంటి వద్దనే చేస్తున్న ఈ పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, మార్టిన్, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, పట్టణ కన్వీనర్ కాకర్ల నాగశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, పిట్టా బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం ధ్యేయం

– ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు డబ్బు లేక వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈనెల 15 నుంచి వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించారన్నారు. ఈనెల 30 నుంచి ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి, గుర్తించిన వారికి అవసరమైతే మళ్లీ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తారని అన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

రేపటి నుంచి వైద్య శిబిరం

చాపాడు : ఈ నెల 30 నుంచి మండల వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. వైద్య శిబిరాలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

రేపు బేతాయపల్లెలో వైద్యశిబిరం

గోపవరం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి శనివారం బేతాయపల్లె సచివాలయం వద్ద ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ నర్మద తెలిపారు. వలంటీర్లు, ఏఎన్ఎం ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించారన్నారు. సుమారు 200 మందికి ఈ వైద్యశిబిరంలో వైద్యసేవలు అందించనున్నట్లు ఆమె తెలిపారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు పుల్లివీడులో..

పోరుమామిళ్ల : ఈనెల 30న పుల్లివీడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. శిబిరంలో ప్రజలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం

బద్వేలు అర్బన్ : ప్రజలకు మరింత వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకువచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో శుక్రవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బద్వేలు మున్సిపాలిటీ, బద్వేలు మండలం, గోపవరం, అట్లూరు మండలాలు, సాయంత్రం 5 గంటలకు పోరుమామిళ్లలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో పోరుమామిళ్ళ, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా మండలాల పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, జేసీఎస్ కన్వీనర్లు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

శాంతి మార్గంలో పయనించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రశాంత జీవనానికి మహ్మద్ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో పయనించాలని అంజుమనె అహ్లె ఇస్లాం అధ్యక్షుడు బొల్లవరం బాషా పేర్కొన్నారు. గురువారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా అంజుమనె అహ్లె ఇస్లాం ఆధ్వర్యంలో ముస్లింలు మైదుకూరు రోడ్డులోని నజిరుల్లా మఠం నుంచి ఆసారే షరీఫ్ దర్గా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఎస్ ముక్తియార్, ఖాజీ ఇనాయతుల్లా, మోడంపల్లె మోదిన్ సాహెబ్, కుతుబుద్దీన్, వివిధ మసీదుల మౌజన్లు, ముస్లింలు పాల్గొన్నారు.

ఖాజీపేట : మండలంలో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. సర్వర్ ఖాన్ పేట లోని మసీదు నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు ర్యాలీగా బయలుదేరి ఖాజీపేట మసీదు వరకూ నిర్వహించారు. అక్కడ నుంచి ఖాజీపేట బస్టాండ్ కూడలి వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ప్రవక్త చేసిన సూచనలు, బోధనలు మత పెద్దలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదు వద్ద అన్నదానం నిర్వహించారు.

పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. స్థానిక జీవన జ్యోతి పాఠశాలలో సహదేవ అనిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఉచితంగా కుక్కలకు, పిల్లులకు యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేబిస్ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పశు వైద్య అధ్యాపకుడు డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి రాకుండా యజమానులు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో జీవన జ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, డాక్టర్ రమేష్, పశువైద్య కళాశాల సహాచార్యుడు డాక్టర్ రాంబాబు, లక్ష్మణ కుమార్, మధుసూదన్‌రెడ్డి, సతీష్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కళావతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని విశ్వంభర దత్తాత్రేయ స్వామి ఆలయంలో భాద్రపద మాస చవితి సందర్భంగా ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. వేకువ జామున దత్తాత్రేయ స్వామి మూల విరాట్‌కు, దత్తాత్రేయ స్వామి, అనఘాదేవి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. అనంతరం అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. వ్రతాన్ని ఆచరించడం వల్ల కలిగే శుభాలను ఆలయ అర్చకులు రామాచారి, వాసు స్వామి వివరించారు. కార్యక్రమంలో శ్రీపాద వల్లభ సేవా సంఘం నిర్వాహకులు చింతకుంట జయచంద్ర, మిట్టా నరేష్ గుప్తా, సుధాకర్, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

బ్రహ్మంగారిమఠం : తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ వైఎస్సార్ జిల్లా కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఉదయం 9 గంటలకు ఈశ్వరీదేవి మఠంలో ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రచార కమిటీ సభ్యుడు చాపాటి వెంకటసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు ప్రత్యేక స్పందన

బద్వేలు అర్బన్ : స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 8:30 నుంచి ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల తహసీల్దారు వై.మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

పోరుమామిళ్ల: పారిశుధ్య కార్మికులు ప్రజలకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 'స్వచ్ఛత హి సేవ'లో భాగంగా గురువారం రంగసముద్రం పంచాయతీ బ్లెస్డ్ బ్రెయాన్ ఆశ్రమంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛత హి కార్యక్రమం చేపట్టిందన్నారు. సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బందికి విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇప్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ-1 సీఎం బాషా, వైస్ ఎంపీపీ-2 చెన్ను రాజశేఖర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కె. రమణారెడ్డి, డీఎల్‌పీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నూతనంగా నిర్మించిన రామాలయంలో జిల్లా పంచాయతీ అధికారి పూజలు చేశారు.

వెంటిలేటర్‌పై టీడీపీ

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మైదుకూరు : రాష్ట్రంలో టీడీపీ వెంటిలేటర్‌పై ఉందని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. దానికి పవన్ కళ్యాణ్ అనే ఆక్సిజన్‌ను ఎక్కిస్తున్నారని పేర్కొన్నారు. ఆక్సిజన్‌ను తీసేస్తే ఆ పార్టీ కనుమరుగవుతుందని తెలిపారు. గురువారం మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. లోకేష్ ఢిల్లీకి వెళ్లి హల్‌చల్ చేస్తున్నాడని, నాలెడ్జి, అనుభవం లేని లోకేష్ వల్ల ఏమీ కాదన్నారు. చట్టప్రకారం చంద్రబాబును పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. తప్పు చేయకపోతే నిజాయితీని నిరూపించుకోవాలి కానీ ఆందోళనలతో, నిరాహార దీక్షలతో బెయిల్ వస్తుందా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ ఒక్క ఎమ్మెల్యే సీటు లేని జనసేనను నమ్ముకుని రాజకీయం చేసే దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. జనసేన కింద టీడీపీ పని చేయాలని పవన్‌కళ్యాణ్ సోదరుడు నాగబాబు అంటున్నారంటే అంతకంటే హీనం మరొకటి లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ శెట్టిపల్లె నాగిరెడ్డి, సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బండి నాగేంద్రప్రసాద్, ఎంపీపీ థామస్ పాల్గొన్నారు.

'నిన్ను మేము గెలిపించాం.. రాజీనామా చెయ్'

మైదుకూరు : శివపురం సర్పంచ్‌గా కొండా భాస్కర్‌రెడ్డిని ఎమ్మెల్యే అండదండలతో తాము గెలిపించామని, ఆయన తన పదవికి రాజీనామా చేసి బలం ఉంటే మళ్లీ గెలవాలని మైదుకూరు జెడ్పీటీసీ భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి సవాల్ విసిరారు. జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేయాలని భాస్కర్‌రెడ్డి తమను డిమాండ్ చేయడంపై గురువారం ఏవీ సుబ్బారెడ్డి శివపురం పంచాయతీ నాయకులు, వార్డు సభ్యులతో కలిసి స్పందించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము జెడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యామన్నారు. పుట్టా సుధాకర్ యాదవ్ కూడా తనకు పోటీ పెట్టించలేకపోయారని గుర్తు చేశారు.

డీలర్ షిప్‌ను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చారని భాస్కర్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. పంచాయతీలోని భీమ లింగాయపల్లె మైనారిటీలకు ఉన్న డీలర్ షిప్‌ను టీడీపీ అధికారంలోకి రాగానే పుట్టా సుధాకర్‌యాదవ్ కేవలం మూడు కుటుంబాలు ఉన్న తన సామాజిక వర్గానికి ఇప్పించారని అన్నారు. కుల వివక్షను రేపుతూ కక్షలు పెరిగేలా భాస్కర్‌రెడ్డి దిగజారి మాట్లాడడం తగదన్నారు.

రేపు వైద్య శిబిరం

చాపాడు : విజయనగరం, కుచ్చుపాప గ్రామాలలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కావ్యమాధురి తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

బద్వేలు అర్బన్ : నేటి యువత, విద్యార్థులు భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతిని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సుందరయ్యకాలనీలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సురక్ష బ్లడ్ బ్యాంక్‌లో భగత్ సింగ్ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ రెడ్డి, డాక్టర్ చక్రధర్ ,డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ రక్తం అవసరమైతే 9502494474, 7671073221 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

కలసపాడు : భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో విద్యార్థులు ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. స్థానిక బాలుర వసతిగృహంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా

బద్వేలు అర్బన్ : నమ్మిన విలువల్ని, సిద్ధాంతాల్ని తన రచనల ద్వారా నిక్కచ్చిగా ప్రకటించిన నవయుగ కవిచక్రవర్తి గుర్రంజాషువా అని మండల్ ఆశయసాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కె.రమేష్‌యాదవ్, బీసీ చైతన్యసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.సి.రమణ, ప్రజాకవి శ్రీనివాసవర్మలు తెలిపారు. జాషువా 128వ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక బీసీ చైతన్యసమితి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలిండియా కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాట్లసామేలు, సామాజిక చైతన్య సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రహ్మయ్య, ఘంటసాల లలిత కళాపరిషత్ అధ్యక్షులు ఎస్.ఎస్.దావూద్, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని కొనియాడారు. రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాటాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, బోగా గంగాధర్, మధుబాబు, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, పీటీఎల్‌యూ నాయకుడు వల్లెపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.